సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 30 । జూలై । 2023



భక్తిశ్రద్ధలతో మొహర్రం

మొహర్రంను పురస్కరించుకుని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా చాదర్‌లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూలు, దట్టీలు సమర్పించారు. పీర్ల చావిడి వద్దకు ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని అగ్నిగుండం చుట్టూ అలయ్ ఆడుతూ సందడి చేశారు. చివరగా నిమజ్జనం చేశారు.

న్యూస్‌రీల్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: మండలంలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్‌లోని సీతారాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, హారతి, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ అర్చన నిర్వహించారు.ఘట్టుపల్లి ఆలయంలో దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, పూజారి సంతోష్ శర్మ, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆరోగ్యశ్రీ ఈహెచ్ఎస్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీడీఎస్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు1న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు


కంటి అద్దాలను అందజేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్: మానవ శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన కంటి అద్దాలను శనివారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పట్టణంలోని పద్మావతి కాలనీ ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల కంటి వెలుగు శిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. ఈ శిబిరాల్లో ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, దూరపు చూపు లోపం ఉన్న వారిని గుర్తించి వారి కోసం ప్రత్యేకంగా కంటి అద్దాలను చేయించిందని చెప్పారు. వాటిని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కంటికి సంబంధించి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సమస్య తీవ్రమై శాశ్వతంగా దృష్టి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు భారతి, సుకేలి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సంచుల్లో నింపిన చామగడ్డ

సండే స్పెషల్

చామగడ్డ.. నాగన్‌పల్లి అడ్డా

ఆ ఊళ్లో ఎకరం కాదు.. రెండెకరాలు కాదు.. ఏకంగా వంద ఎకరాల్లో ఒకే పంట పండిస్తున్నారు.. ఒక రైతును చూసి మరో రైతు.. అలా ఊరంతా చామగడ్డ సాగును నమ్ముకున్నారు. ఏడాదంతా దిగుబడి సాధిస్తూ.. లాభాలు ఆర్జిస్తూ .. మరింత మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ గ్రామ రైతులు.. చామగడ్డ సాగుకు అడ్డాగా మారిన ఆ గ్రామమే ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి. ప్రత్యేకతను చాటుతున్న గ్రామంపై సండే స్పెషల్..

ఊరుఊరంతా ఒకే పంట

- 100 ఎకరాలకు పైగా సాగు
- ఏడాదంతా దిగుబడి
- కూలీలకు చేతినిండా పని
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామ రైతులు

ఇబ్రహీంపట్నం రూరల్: వర్షాధారిత ప్రాంతం అయినప్పటికీ వ్యవసాయాన్నే నమ్ముకొని ఇక్కడి రైతులు జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా ప్రతి గ్రామంలో వ్యవసాయ బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేయడం పరిపాటి. వరి, లేదంటే ఆకుకూరలు, ఆరుతడి పంటలు వేసుకోవడం అనవాయితీ. కానీ నాగన్‌పల్లిలో చిన్న, సన్నకారు రైతుల నుంచి మొదలుకొని పెద్ద రైతుల వరకు చామగడ్డను సాగు చేస్తున్నారు. పెట్టుబడి ఎక్కువ అయినప్పటికీ లాభాలు సైతం అదే స్థాయిలో ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. 20 ఏళ్లుగా ఇదే పంటను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు.

టన్నుల్లో దిగుబడి..

నిత్యం టన్నుల్లో దిగుబడి సాధిస్తున్నారు. నగరానికి అవసరమయ్యే చామగడ్డ ఇక్కడి నుంచే సరఫరా అవుతోంది. ప్రతి రోజు రాత్రి సమయంలో డీసీఎంలలో పంటను మార్కెట్‌కు తరలిస్తారు. ఏడాది పొడవునా పంటను సాగు చేస్తున్నారు. అత్యధికంగా మే నుంచి మొదలుకొని డిసెంబర్ వరకు దిగుబడి బాగుంటుంది. నాలుగు ఎకరాల్లో పంట సాగు చేస్తే రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చు వస్తుందని.. దిగుబడి రూ.22 లక్షల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. మూడు రెట్లు లాభసాటి ఆదాయం ఉందంటున్నారు.


చామగడ్డ సాగు

రైతులకు లాభాలు.. కూలీలకు ఉపాధి..

చామగడ్డ సాగు రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అదే స్థాయిలో కూలీలకు కూడా ప్రతి రోజు ఉపాధి దొరుకుతోంది. రోజుకు రూ.350కి పైగా కూలీ చెల్లిస్తున్నారు. ఒక్కో రైతు వద్ద ప్రతి రోజు పది నుంచి 20 మంది పని చేయాల్సి వస్తుంది. పంట కోయడం, గడ్డ తీయడం, నీళ్లలో కడగడం, సంచుల్లో నింపడం వంటి పనులు చేస్తూ కూలీలు జీవనం సాగిస్తున్నారు. బస్తాల్లో నింపి ఆటోల్లో వేసే వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది.

ఇదే ఆధారం



ఎకరంన్నరలో చామగడ్డ సాగు చేశా. రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాం. పది రోజులుగా దిగుబడి వస్తోంది. గ్రామంలో చాలామంది రైతులు ఇదే పంటను నమ్ముకుని సాగు చేస్తున్నాం. లాభాలు బాగున్నాయి. దళారీలు లేకుండా మార్కెట్ సాకర్యం ఉంటే మరింత బాగుంటుంది.

– పందాల దానయ్యగౌడ్, రైతు

50 మంది రైతులు.. రూ.9.90 కోట్లు

బందరావిరాల మైనింగ్‌జోన్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల పరిధిలోని బందరావిరాల మైనింగ్‌జోన్‌లో భూములు కోల్పోయిన సర్వేనంబర్ 268 భూ నిర్వాసితులు నష్టపరిహారం చెల్లించాలంటూ 348 రోజులు ధర్నా చేపడుతుండగా ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. మొత్తం 209 మంది రైతులు భూములు కోల్పోగా వారిలో 50 మందికి మాత్రమే నష్టపరిహారం చెల్లించనున్నట్లు జీఓ జారీ చేసింది.మొత్తం 50 మంది రైతులకు గాను రూ.9.90కోట్లు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తేదీని ప్రకటించనున్నట్లు తహసీల్దార్ అనిత తెలిపారు. కాగా 209 మంది ధర్నా చేస్తుంటే కేవలం 50మందికే నష్టపరిహారం చెల్లిస్తామనడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ జోన్‌లో భూములుకోల్పోయి న రైతులందరికీ పరిహారం చెల్లించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి తదితరులు

తుర్కయంజాల్: గ్రంథాలయాల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తోందని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో గ్రంథాలయ నిర్మాణం కోసం శనివారం పలువురు కౌన్సిలర్లు, నాయకులతో కలిసి స్థలాలను పరిశీలించారు. తుర్కయంజాల్ రెవెన్యూ కమ్మగూడలోని సర్వే నంబర్ 276, 471, 323లోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థ చిక్కి శల్యమైందని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో మహర్దశ పట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటికే 30 పఠనామందిరాలను ఏర్పాటు చేశామని, మరో 30 గ్రామీణ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. అమేజాన్ సంస్థ సహకారంతో 10 గ్రంథాలయాల నిర్మాణం జరుగుతుందని, వీటి నిర్వహణను గ్రంథాలయ సంస్థనే చేపట్టనుందని తెలిపారు. దీంతో మొత్తం 95 గ్రంథాలయాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, నాయకులు రొక్కం చంద్రశేఖర్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, కాకుమాను చిన్నయ్య, కుంట గోపాల్ రెడ్డి, మేతరి దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్ధృతి తగ్గుముఖం

- జంట జలాశయాలకు తగ్గిన వరద
- ఎగువ నుంచి 1,800 క్యూసెక్కులు
- దిగువకు 2,202 క్యూసెక్కుల విడుదల

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి నగరంలోని హుస్సేన్‌సాగర్‌తో పాటు జంట జలాశయాలకు పది రోజులుగా వరద ఉద్ధృతి కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లకు 1,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, వాటి గేట్లు ఎత్తి దిగువకు 2,202 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హిమాయత్‌సాగర్ రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద 3,500 నుంచి 1,300 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం రెండు గేట్లు ఎత్తి దిగువకు మూసీలో నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,763.50 అడుగులకు గాను ప్రస్తుతం 1,761.70 అడుగులు కొనసాగుతోంది. ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు రెండు వేల క్యూసెక్కుల నుంచి 500 క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టగా, దిగువకు నాలుగు గేట్ల ద్వారా 852 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. దీంతో పూర్తి స్థాయి నీటి మట్టం 1,790.00 అడుగులకు గాను, ప్రస్తుతం 1,787.90 అడుగులు కొనసాగుతోంది.

రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

- గౌడలకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి
- గౌడ, కల్లుగీత సంఘాల రాష్ట్ర నాయకుల డిమాండ్

ఆమనగల్లు: గౌడ కులస్తులకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, జనాభా ప్రాతిపదికన ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వెంకన్నగౌడ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, కంఠ మహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ అల్లాజీగౌడ్ డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో వెనుకబడిన గౌడల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. పట్టణంలోని భవానీ గార్డెన్స్‌లో శనివారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్థుల సమస్యలపై, నూతన కమిటీల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 16శాతం ఉన్న గౌడ కులస్థులకు రాజకీయ రంగంలో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన 24 మంది ఎమ్మెల్యేలు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గౌడకులస్థులకు రాజ్యాధికారం దక్కడానికి గౌడకులస్థులు ఏకంకావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మల, గౌడ సంఘం కల్వకుర్తి అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లుగౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగ ఫకీరయ్య గౌడ్, సంఘం నాయకులు బాలస్వామి గౌడ్, గంగా రవీందర్‌గౌడ్, యాదయ్య, నారాయణ, యాదమ్మ, నిరంజన్‌గౌడ్, బాలకృష్ణ, పరమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవునిఎర్రవల్లిని చేవెళ్లలో కలపొద్దు

మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిని కోరిన గ్రామస్తులు

చేవెళ్ల: మా గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దంటూ దేవునిఎర్రవల్లి గ్రామస్తులు మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. శనివారం ఉదయం పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ సమితి అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు మంత్రికి, ఎంపీకి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపవడం వల్ల గ్రామ ఉనికి కోల్పోతుందని తెలిపారు. అంతేకాకుండా ఉపాధి హామీ పనులు లేకుండా పోతాయని పేర్కొన్నారు. అభివృద్ధి కూడా ఆగిపోతుందని అన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీగా చేయడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉండేలా చూడాలన్నారు. మున్సిపల్ పరిధిలోకి వెళితే పన్నులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. తమ గ్రామాన్ని విలీనం లోనుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దేవునిఎర్రవల్లి ప్రజలు

కాదని మున్సిపాలిటీలో కలిపితే ఉద్యమిస్తామన్నారు. దీనిపై మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. స్పందించిన మంత్రి, ఎంపీ గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మున్సిపాలిటీలో కలిస్తే వేగంగా అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందని మంత్రి చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో దేవునిఎర్రవల్లి మాజీ సర్పంచ్ చంద్రయ్య, గ్రామస్తులు విఠల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, రమేశ్, గోపాల్, హరి, సత్యనారాయణ, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగ బాలికపై అత్యాచారం

ఫహాడీషరీఫ్: మూగ బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఫహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక(14) ఇళ్లల్లో పని చేస్తుంది. ఈ నెల 28న పని ముగించుకుని ఇంటికి చేరుకుంది. అక్కడే ఉండే యాసిన్(40) ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించి, లోనికి చొరబడి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు.

బండి సంజయ్ నియామకంపై హర్షం

తుక్కుగూడ: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై ఆ పార్టీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బండి సంజయ్ మరిన్ని పదవులు అలంకరించాలని ఆయన ఆకాంక్షించారు.

డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి

బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కొందుర్గు మండలం టేకులపల్లి, ఉత్తరాశిపల్లి గ్రామాలకు చెందిన 80మంది ఆ మండల అధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ అధ్యక్షతన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలాచారి మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలనను అంతం చేసేందుకు యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తప్పుడు వాగ్దానాలతో మభ్యపెడుతూ మోసం చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌ను ఇంటికి పంపాలన్నారు. రాష్ట్రంలో పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతోందని అన్నారు. ఈ నెల 31న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే పార్లమెంట్ ప్రబాస్ యోజన కార్యక్రమాన్ని



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న బీజేపీ నాయకులు

విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాణిక్యం, మహేందర్, నర్సింహ యాదవ్, సుధాకర్, నాగరాజు చారి, రుషికేష్, శ్యాంసుందర్‌రెడ్డి, శంకర్, అశోక్, శ్రీకాంత్, విజయ్, ఆగమయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు పండుగ సాయన్న

- జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్
- ఘనంగా జయంతి వేడుకలు

షాద్‌నగర్: పేదల కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడు పండుగ సాయన్న అని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. పట్టణంలో సాయన్న జయంతిని శనివారం ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న సాయన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈట గణేష్, సంఘం తాలూకా అధ్యక్షుడు రాములు మాట్లాడారు. విప్లవ వీరుడు పండుగ సాయన్న ఆనాటి నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి, వారిని ఎదురించి తన సొంత పాలనా వ్యవస్థను ఏర్పాటు చేశాడని అన్నారు. సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు పండగ సాయన్న ఎంతో ప్రయత్నం చేశారని



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

పేర్కొన్నారు. భూస్వాములు, పెత్తందారులు పేదలపై ఆధిపత్యాన్ని చెలాయించే వారని అన్నారు. పేదలకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించేందుకు పండుగ సాయన్న వీరోచితమైన పోరాటం చేశాడని తెలిపారు. వీరత్వాన్ని, ధైర్యాన్ని ప్రదర్శించిన సాయన్న జీవిత చరిత్ర గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహనీయుడిని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు. నాయకులు మంగ వెంకటేష్, మదన్‌మోహన్, అంతయ్య, శ్రీధర్‌వర్మ, విఠల్, లక్ష్మణ్, రమేష్, శ్రీధర్, రాజు, అంజయ్య, మోహన్, రాజు, మధు, రవి, రాఘవేందర్, కృష్ణ, పైలయ్య, భాస్కర్, గోపాల్, విఠ్యాల రాజు, కుడుముల బాల్‌రాజ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాలాచారి, నర్సింహాగౌడ్, మోహన్ సింగ్, లక్ష్మీకాంత్ రెడ్డి, మాణిక్యం, రుషికేష్, శ్రీశైలం, నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.